# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 302 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం, 11 అక్టోబర్ 2026 | పేజీ : 04




## కొనుగోలులో రైతులు ఇబ్బంది పడొద్దు

- జనగామ అదనపు కలెక్టర్ బెన్ షా లోమ్

2



3 లో

## మహబూబాబాద్ జిల్లా జోలికొస్తే ఊరుకోం..

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హెచ్చరిక



### ఆడబిడ్డల ఆత్మగౌరవానికి

# మన బతుకమ్మ

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి
- ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ

**తొర్రూరు, మన చౌరాస్తా :** తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, సంప్రదాయాలకు, ప్రకృతి ఆరాధనకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, వేటా (WETA) అధ్యక్షురాలు, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. తొర్రూరు మున్సిపాలిటీ, వేటాఇండియా సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తొర్రూరు పెద్ద చెరువు సమీపంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. స్థానిక మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను తీర్చిదిద్ది, సంప్రదాయ వస్త్రధారణతో బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో పెద్ద చెరువు పరిసరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయం మహిళల్లో ఐక్యతను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమా రజిని రాజశేఖర్, వార్డు కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి, సీనియర్ నాయకులు చాపల బాపురెడ్డి, పెదగాని కళావతి సోమయ్య, బసనబోయిన ఐలమ్మ, జాటోత్ భద్రు నాయక్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.






# చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌ను తొలగించాలి

- **యూఎస్‌పీసీ జనగామ జిల్లా కమిటీ డిమాండ్**




**జనగామ, మన చౌరాస్తా :** స్వతంత్ర సంస్థగా పని చేయాల్సిన కేంద్ర ఎలక్షన్ కమిషన్, ప్రభుత్వం చేతుల్లో కీలుబొమ్మగా మారి ప్రజాస్వామ్యాన్ని పరిహసించేలా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (USPC) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్యానికి మచ్చగా మారిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియను రద్దు చేసి సామాన్యుని ఓటు హక్కును కాపాడాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రధాన ఎన్నికల అధికారి రాజీనామాను డిమాండ్ చేస్తూ జనగామ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట USPC ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి USPC స్టీరింగ్ కమిటీ బాధ్యులు శ్రీనివాసులు, చంద్రశేఖర్ రావు, నల్లనాగుల రాజు, షరీఫ్, శాడ రవి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా స్టీరింగ్ కమిటీ బాధ్యులు మాట్లాడుతూ.. సీఈసీ (CEC) ఏకపక్ష నిర్ణయాలను వెంటనే సమీక్షించాలని, ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కాపాడాలని స్పష్టం చేశారు. అలాగే ఇప్పటి వరకు తొలగించిన 13 కోట్ల ఓట్లపై సమగ్ర, స్వతంత్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం2023ను రద్దు చేయాలని, 2024లో మరియు ఆ తర్వాత జరిగిన అన్ని ఎన్నికలపై విచారణ జరపాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈవిఎం (EVM)ల బదులు బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు మాదూరి వెంకటేష్, అంకూషా వళి, శ్రీనివాస చారి, లక్ష్మయ్య, కృష్ణ, వజ్రయ్య, శ్రీనివాసులు, సయ్యద్ శ్రీనివాసులు, రాజేందర్, శోభన్, వీరా రెడ్డి, అఫ్సర్, నర్సింహులు, గణేష్, లక్ష్మణ్ జీ, రాజీ రెడ్డి, యాదయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

- **అదనపు కలెక్టర్ బెన్షా లోమ్**



**జనగామ, మన చౌరాస్తా:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ అధికారులను ఆదేశించారు. జనగామ మండలంలోని షామీర్‌పేట గ్రామంలో ఐకేపీ (IKP) ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం సేకరణలో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా కొనుగోళ్లు జరపాలని కేంద్ర నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు కూడా తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేటప్పుడు నిబంధనల ప్రకారం తేమ శాతం, నాణ్యతా ప్రమాణాలు ఉండేలా చూసుకోవాలని కోరారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం, సివిల్ సప్లైస్ డీటీ (DT CS), గ్రామ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించాలి

- **బీఆర్ఎస్ నేతల డిమాండ్**



దేవరుప్పుల, మన చౌరాస్తా : జనగామ జిల్లా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా పర్యటనకు వెళ్తూ దేవరుప్పుల మండల కేంద్రంలో విలేకరులతో వారు మాట్లాడారు. జనగామ జిల్లా ఏర్పడి దశాబ్ద కాలం పూర్తయిన సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి వేడుకలు జరుపుకోవాలని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో సుభిక్షంగా ఉందన్నారు. జిల్లా ఏర్పాటు తర్వాతే జనగామ ప్రాంతం ఊహించని రీతిలో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. నూతన కలెక్టరేట్ కార్యాలయం, మెడికల్ కళాశాల, మాతా శిశు ఆస్పత్రులతో పాటు వల్మిడి, బమ్మెర, పాలకుర్తి సోమేశ్వరాలయం, జీడికల్ వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలను అభివృద్ధి చేసుకున్నామని గుర్తుచేశారు. అలాగే దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేసి, ఒకప్పుడు ఎడారిలా ఉన్న జనగామ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశామని వివరించారు. ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించే ఈ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి జనగామ, పాలకుర్తి, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ మూడేళ్ల పాలనలో రాష్ట్రం పూర్తిగా నాశనమైందని, రేవంత్ రెడ్డి పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు విమర్శించారు. రాబోయే రోజుల్లో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనేనని, కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీలకు విద్యార్థుల ఎంపిక

**జనగామ, మన చౌరాస్తా :** ఎస్.జి.ఎఫ్ (SGF) రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీలకు జనగామ జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన బానోతు సంతోష్ కుమార్, కందుల నందిని, పంగ సుప్రియ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను జిల్లా ఎస్.జి.ఎఫ్ కార్యదర్శి జాటోత్ గోర్ సింగ్ అభినందించారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో విద్యార్థులు ఈ స్థాయికి చేరుకోవడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి, జనగామ జిల్లాకీ మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే, విద్యార్థులకు శిక్షణ అందించిన మాస్టర్ ఎండి. అబ్బాస్ తో పాటు వారి తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు.



# సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సేవలు అభినందనీయం

- **డాక్టర్ పావుశెట్టి శ్రీధర్**

**హనుమకొండ, మన చౌరాస్తా :** ఉమ్మడి వరంగల్ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సేవలు ఎంతో అభినందనీయమని అంజన హోమియో కేర్ ఆసుపత్రి అధినేత, ప్రముఖ హోమియోపతి వైద్యులు డాక్టర్ పావుశెట్టి శ్రీధర్ కొనియాడారు. హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన మినీ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి జట్టు అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పిల్లి సాంబశివరావు, సెక్రటరీ తాబేటి రాజేందర్, ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, కోశాధికారి వెంకటేశ్వర్లుతో పాటు సీనియర్ క్రీడాకారులు సాఫ్ట్ బాల్ క్రీడాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో ఈనెల 11, 12 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో హనుమకొండ జిల్లా జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. అంతకుముందు హనుమకొండ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ రాజేందర్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, జాయింట్ సెక్రటరీ సుమలత, కోచ్ పోలేపాక వినయ్ కుమార్, అసోసియేషన్ ప్రతినిధులు అర్జున్, రాజేశ్వర్, ఫిజికల్ డైరెక్టర్లు ఏ. సృజన, శోభ, తాబేటి నాగరాజు, సీనియర్ క్రీడాకారుడు పవన్ మరియు క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కృష్ణాజిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**స్టేషన్ ఘన్ పూర్, మన చౌరాస్తా :** జనగామ జిల్లా చిల్పూర్ మండల పరిధిలోని కృష్ణాజిగూడెంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్షాకాలం ధాన్యం (వడ్ల) కొనుగోలు కేంద్రాన్ని శనివారం గ్రామ సర్పంచ్ మల్లం రవీందర్ లాంఛనంగా ప్రారంభించారు. పిఎసిఎస్ సొసైటీ చైర్మన్ దూదిపాల నరేందర్ రెడ్డి, సీఈఓ మగ్దూమ్ పర్యవేక్షణలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లం రవీందర్ మాట్లాడుతూ రైతులందరూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలి. దళారులు, ప్రైవేట్ వ్యాపారులను నమ్మి తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దు అని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సొసైటీ స్టాఫ్ అసిస్టెంట్ సింగాపురం రాజు, సెంటర్ ఇంచార్జ్ వేల్పుల సుధాకర్, గ్రామ రైతులు గద్ద కుమార్, సాదం రమేష్, సాదం కొమురయ్య, మరపాక యాకుబ్, కర్ర రంజిత్ రెడ్డి, సాదం లింగయ్య, సాదం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.





## అంబరాన్నంటిన
# సంబురం

- ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ











## మహబూబాబాద్ జిల్లా జోలికొస్తే
# ఊరుకునేది లేదు

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**మహబూబాబాద్, మన చౌరాస్తా :** మహబూబాబాద్ జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్తూపం వద్ద బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీలు కవిత, వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలోనే మహబూబాబాద్ కలెక్టరేట్, మెడికల్, నర్సింగ్, హార్టికల్చర్ కళాశాలల ఏర్పాటుతో జిల్లా సమగ్ర అభివృద్ధి సాధించిందన్నారు. ప్రజలు ఎంతో పోరాడి సాధించుకున్న మహబూబాబాద్ జిల్లాను తొలగించేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. అలాగే రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. 2023 నవంబర్ 1 నాటికి డిగ్రీ, డిప్లొమా పూర్తయిన ప్రతి ఒక్కరిని ఓటర్లుగా నమోదు చేయించేలా గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వర్గ విభేదాలను పక్కనపెట్టి పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని ఆయన సూచించారు.



## శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలోని శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన ఈ వేడుకల్లో విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను తీర్చిదిద్ది, సంప్రదాయ వస్త్రధారణతో ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ కళాశాల ప్రాంగణాన్ని పండుగ వాతావరణంలో ముంచెత్తారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే ఈ పండుగ విశిష్టతను నిర్వాహకులు వివరించారు. విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

## లుక్కు మార్చిన

# నాని

టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని ఇటీవలే ప్యారడైజ్ చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న సంగతి తెలిసిందే. పూర్తిగా మాస్, రగ్గడ్ లుక్కులో థియేటర్లను షేక్ చేశారు. దసరా తర్వాత శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన ఈ చిత్రం కలెక్షన్ల సునామీ క్రియేట్ చేసింది. ఇదిలా ఉంటే.. నాని తన కొత్త సినిమా కోసం లుక్కు పూర్తిగా మార్చేశాడు. బ్లడీ రోమియోతో అడియన్స్ ముందుకు రానున్నాడు. టాలీవుడ్ స్టార్ హీరో నాని తన ప్రయోగాత్మక చిత్రాలతో ఎప్పుడూ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంటారు. పాత్ర డిమాండ్ చేస్తే ఎంతటి విభిన్న గెటప్‌కైనా సిద్ధపడే ఆయన, తాజాగా దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'బ్లడీ రోమియో' కోసం పూర్తిగా కొత్త అవతారంలోకి మారిపోయారు. ఇటీవలి కాలంలో ది ప్యారడైజ్ సినిమా కోసం పూర్తిగా రగ్డ్, మాస్ లుక్‌లో కనిపించిన నాని, ఈ సినిమా కోసం అల్ట్రా-స్టైలిష్ అండ్ క్లాసీ లుక్‌లో కనిపించారు. ప్రస్తుతం ఈ కొత్త మేకోవర్‌కు సంబంధించిన లుక్ ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతోంది. ప్రముఖ సెలబ్రిటీ హెయిర్ డిజైనర్ ఆలిమ్ హకీమ్ చేతుల మీదుగా రూపుదిద్దుకున్న ఈ కొత్త లుక్‌లో నాని ఎంతో స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. ట్రెండీ కర్లీ మల్లెట్ హెయిర్‌స్టైల్, దానికి తగినట్లుగా ధరించిన బ్లాక్ రౌండ్ సన్‌గ్లాసెస్ ఆయనకు సరికొత్త స్వాగ్‌ను తీసుకొచ్చాయి. దర్శకుడు సుజీత్ ఈ చిత్రం కోసం నానిని మునుపెన్నడూ చూడని సరికొత్త కోణంలో చూపించబోతున్నట్లు తెలుస్తోంది. నిహారికా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై వెంకట్ బోయనపల్లి ఈ భారీ యాక్షన్ డ్రామాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో నాని పాత్ర చాలా వైవిధ్యంగా ఉండబోతుందని ఇండస్ట్రీ వర్గాల టాక్. ఒకవైపు నిపుణుడైన చెఫ్‌గా కనిపిస్తూనే, మరోవైపు ప్రమాదకరమైన గ్యాంగ్‌స్టర్ షేడ్స్‌ను ప్రదర్శించే సరికొత్త రోల్‌లో ఆయన నటిస్తున్నారు. "బ్లడీ రోమియో.. ది కిచెన్ ఓపెన్స్ సూన్" అంటూ వచ్చిన ప్రమోషనల్ అప్‌డేట్స్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి. వంటశాల నేపథ్యంలో సాగే క్రైమ్ , యాక్షన్ డ్రామా ప్రేక్షకులకు ఒక కొత్త సినిమాటిక్ అనుభూతిని ఇస్తుందని చెప్పవచ్చు. ప్రీతి ముకుందన్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన కీలక షెడ్యూల్ లండన్‌లో ప్లాన్ చేశారు. రొటీన్ సినిమాలకు భిన్నంగా తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్ నాని కెరీర్‌లో మరో మైలురాయిగా నిలవనుందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ అక్టోబర్ నెల నుంచే స్టార్ట్ కానుందని సమాచారం. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకు రాని వినూత్నమైన కాన్సెప్ట్ తో సుజీత్ ఈ సినిమాను మలుస్తున్నారని సమాచారం. ది ప్యారడైజ్ సినిమాకు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించింది.



Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**